






అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..








సంపుటి - 2 సంచిక - 174 ఆదివారం 28 సెప్టెంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

**Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts**


## హీరో విజయ్ సభలో

# తొక్కిసలాట



## 38 మంది మృతి

**వీరిలో ఆరుగురు చిన్నారులు,**

**-తమిళనాట విషాదం**

**16 మంది మహిళలు**

**వందలాదిమందికి గాయాలు**

**కరూర్ సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త) :**
ప్రముఖ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ర్యాలీలో విషాదం చోటు చేసుకుంది. శనివారం కరూర్‌లో జరిగిన ర్యాలీకి భారీఎత్తున ప్రజలు హాజరయ్యారు. కిక్కిరిసిన ఆ జన సందోహాన్ని ఉద్దేశించి విజరు ప్రసంగిస్తుండగా, తీవ్రంగా తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో 36 మంది మరణిం చారని అధికారులు తెలిపారు. మృతుల్లో ఆరుగురు చిన్నారులు, 16 మంది మహిళలు, 11 మంది పురుషులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విజయ్ సాగిస్తున్న పర్యటనలో భాగంగా కరూర్‌లోని వేలుచామిపురంలో శనివారం నిర్వహించిన బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సభ నిర్వహించేందుకు పోలీసులు అనుమతించగా..




విజయ్ సాయంత్రం 6 గంటలకు చేరుకున్నారు. కరూర్‌తోపాటు సమీపంలోని మూడు జిల్లాల నుంచి వచ్చిన విజయ్ అభిమానులు, మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన పార్టీ స్వచ్ఛంద కార్యకర్తలు దాదాపు ఆరుగంటలపాటు ఎండలో వేచి ఉన్నారు. ప్రజలు ఎక్కువగా, కిక్కిరిసిపోయి వుండడం, వేడిగా ఉండడంతో సభ జరుగుతుండగానే అనేకమంది ఊపిరాడక కండ్లు తిరిగి పడిపోయినట్టు తెలుస్తోంది.

మిగతా 2లో.

## ఎపిలో పర్యాటక

# అభివృద్ధికి పెద్దపీట

- పర్యాటకంతో ఎన్నో దేశాలు అభివృద్ధి
- మనదేశంలో ఆకర్శణీయమైన పర్యాటక కేంద్రాలు
- పర్యాటకం గేమ్ ఛేంజర్ అన్న సిఎం చంద్రబాబు




విజయవాడ, **సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త) :** ప్రస్తుతం కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలో టూరిజం కీలకంగా మారిందని, టూరిజాన్ని నమ్ముకునే అభివృద్ధి చెందుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. టూరిజం వల్ల ఏజెన్సీలోనూ అనేక మంది ఉపాధి పొందుతున్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చాం.. ఇది గేమ్ ఛేంజర్. పర్యాటక ప్రాజెక్టులకు ప్రత్యేక ప్యాకేజీలు, రాయితీలు ఇస్తున్నామని అన్నారు. మిగతా 2లో...

# ఏపీ పర్యటనకు మోదీ...

## చంద్రబాబు, పవన్‌తో కర్నూలులో భారీ ర్యాలీ

- అక్టోబర్ 16న ఆంధ్రప్రదేశ్‌కు రానున్న ప్రధాని మోదీ
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధాని పర్యటన
- శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకోనున్న ప్రధాని



2లో.

# 23 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం

**ఏపీ అసెంబ్లీ నిరవధిక వాయిదా...**

**మొత్తం 46 గంటల పాటు సాగిన చర్చలు**

**మూడు బిల్లులను ఉపసంహరించుకున్న ప్రభుత్వం**

**సమావేశాలకు గైర్హాజరైన ప్రతిపక్ష నేత జగన్**



అమరావతి **సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త) :**
ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ముగిశాయి. ఎనిమిది రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ వి. అయ్యన్న పాత్రుడు శనివారం ప్రకటించారు. ఈ సెషన్‌లో మొత్తం 23 బిల్లులను సభ ఏకగ్రీవంగా ఆమోదించడం విశేషం. మిగతా 2లో...

# అక్టోబరు 4న ఆర్థికసాయం

**ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15 వేల ఆర్థిక సాయం**

**అక్టోబరు 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు నగదు జమ**

**రాష్ట్రవ్యాప్తంగా 2.9 లక్షల మంది డ్రైవర్లకు ప్రయోజనం**

**అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన**

**అర్హులైన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని ప్రభుత్వం హామీ**

**పెండింగ్ చలాన్లు క్లియర్ చేసుకున్న వారికీ వర్తింపు**



# పేరెంట్స్‌ను నిర్లక్ష్యం చేయొద్దు

**: గ్రూప్-1 అభ్యర్థులకు నియామకపత్రాల కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి**

**ఉద్యోగుల జీతంలో 10 శాతం తల్లిదండ్రుల ఖాతాల్లోకి**

**-త్వరలో చట్టం తెస్తాంపదేండ్ల పాలకులు విశ్వాసఘాతకులు**

**మేథోశక్తిని చాటాలి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

హైదరాబాద్ **సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త) :**
'పిల్లల చదువులు, ఉద్యోగాల సాధన కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడతారు. అవసరమైన డబ్బులు ఇస్తూ, వారి భవిష్యత్ కోసం సర్వం త్యాగం చేస్తారు. ఉద్యోగం వచ్చాక తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు. అలా చేస్తే ఉద్యోగుల జీతంలో పది శాతం కోత విధించి, పేరెంట్స్ ఖాతాల్లో వేస్తాం. దీనిపై త్వరలోనే చట్టం తెస్తాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

మిగతా 2లో.



# కాంగ్రెస్ బాకీ కార్డ్ ఉద్యమం

**ఆ పార్టీ మోసాలను వివరించేందుకే**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




2లో.

# హైదరాబాద్ వరద బాధితులకు అండగా నిలవండి..

**జనసేన శ్రేణులకు, అభిమానులకు పవన్ పిలుపు**



2లో.


## దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్

# స్వదేశీ 4జీ నెట్‌వర్క్...

**ఒడిశాలో లాంఛనంగా సేవలను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ**

**టీసీఎస్, సీ-డాట్, తేజస్ నెట్‌వర్క్స్‌తో కలిసి పూర్తి దేశీయంగా రూపకల్పన**

**26,700 మారుమూల గ్రామాలకు అందనున్న హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు**



2లో.

# మూసీ ఉగ్రరూపం

**వరద నీటిలో ఎంజీబీఎస్.. బస్సుల రాకపోకలు నిలిపివేత**

హైదరాబాద్ **'సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త) :**
మూసీ నది హైదరాబాద్‌ను అతలాకుతలం చేసింది. శుక్రవారం రాత్రి ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగిపోవటంతో మూసీ నదికి ఇరువైపు లా ఉన్న కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. ఎన్నడూ లేనివిధంగా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌ను వరద ముంచెత్తింది. మిగతా 2లో...



# హీరో విజయ్ సభలో తొక్కిసలాట

అభిమానుల్లో కొంతమంది తమ నటుడిని దగ్గర నుంచి చూడాలనే ఉద్దేశంతో బస్సు సమీపంలోకి వెళ్లడానికి ప్రయత్నించడంతో తొక్కిసలాట మొదలైనట్టు అధికారులు చెబుతున్నారు. వీరిని వెంటనే కరూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, సమీపంలోని ప్రయివేటు ఆస్పత్రులకు హుటాహుటిన తరలించారు. 500మందికి పైగా ఇప్పటికే ఆస్పత్రుల్లో చేరినట్టు తెలుస్తోంది. మరో 400మందికి పైగా తీసుకువస్తున్నారని సీనియర్ పోలీసు అధికారి డేవిడ్సన్ దేవాశీర్వాదం తెలిపారు. తొక్కిసలాట సమాచారం అందడంతో షెడ్యూల్ సమయానికి కన్నా ముందుగానే విజయ్ తన ప్రసంగాన్ని ముగిం చేశారు. అవసరమైన సాయాన్ని యుద్ధ ప్రాతిపదికన అందజేయాల్సిందిగా ఆదేశించారు. మరోపక్క జనాల రద్దీ బాగా వుండడంతో అంబులెన్సులు అవసర మైన చోటుకు వెళ్లడానికి కూడా బాగా సమయం పట్టేసింది.

**ఒక్కొక్కరికి రూ.10 లక్షల నష్టపరిహారం**

కరూర్ తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించింది. ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున సాయం చేస్తామని తమిళనాడు సీఎం స్టాలిన్ చెప్పారు. తనకు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని సీఎం స్టాలిన్ అన్నారు. తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారికి రూ.1 లక్ష పరిహారం అందించనున్నట్టు వివరించారు. శనివారం రాత్రి 9.40 గంటలకు సచివాలయానికి వచ్చిన ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆయన కరూర్ వెళ్లనున్నారు.

# 23 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం

(మొదటి పేజి తరువాయి)

ఈ సమావేశాలు మొత్తం 8 రోజుల పాటు 45 గంటల 53 నిమిషాల పాటు కొనసాగాయి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, పరిపాలన, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై సభ్యులు చర్చించారు. ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టిన బిల్లులన్నింటికీ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదముద్ర వేశారు. అయితే, మరో మూడు బిల్లులను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. వీటితో పాటు ఆరు ముఖ్యమైన అంశాలపై సభలో సుదీర్ఘంగా చర్చ జరిగింది.

సమావేశాల ముగింపు సందర్భంగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ, "సభలో ప్రవేశపెట్టిన అన్ని బిల్లులు ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. ఇప్పుడు సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నాం" అని తెలిపారు.కాగా, ఈ సమావేశాలకు వైసీపీ అధినేత జగన్ హాజరుకాకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక జరిగిన ఈ తొలి సమావేశాలు ఫలవంతంగా ముగిశాయని, తదుపరి సమావేశాల్లో రాష్ట్ర బడ్జెట్‌తో పాటు మరిన్ని కీలక విధానాలపై చర్చించే అవకాశం ఉందని అధికార వర్గాలు అంటున్నాయి.

# ఏపీ పర్యటనకు మోదీ...

## చంద్రబాబు, పవన్‌తో కర్నూలులో భారీ ర్యాలీ

- **అక్టోబర్ 16న ఆంధ్రప్రదేశ్‌కు రానున్న ప్రధాని మోదీ**

అమరావతి **సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త) :**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. అక్టోబర్ 16వ తేదీన ఆయన రాష్ట్రానికి రానున్నారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటిస్తారు. తొలుత ఆయన శ్రీశైలం క్షేత్రానికి వెళ్లి మల్లికార్జున స్వామిని దర్శించుకుంటారు. అనంతరం కర్నూలులో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లతో కలిసి రోడ్‌షో నిర్వహిస్తారు. జీఎస్టీ సంస్కరణల అంశంపై కూటమి నేతలు ముగ్గురూ కలిసి ఈ భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.ఈ పర్యటన సందర్భంగా రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కూడా ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఈ వివరాలను మంత్రి నారా లోకేశ్.. శాసనమండలి లాబీలో ఇతర మంత్రులు, ఎమ్మెల్సీలతో మాట్లాడుతూ ప్రస్తావించినట్లు సమాచారం. ఈ పర్యటన ద్వారా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# మూసీ ఉగ్రరూపం

(మొదటి పేజి తరువాయి)

దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. వారిని హైడ్రా, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది బయటకు తరలించారు. ముందు జాగ్రత్తగా మూసీ నదిపై ఉన్న లో లెవల్ వంతెనలు మూసేశారు. పురానాపూల్, చాదర్‌ఘాట్, మూసారంబాగ్ కాజ్‌వేలను మూసేశారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మూసీ నదికి భారీ వరద పోటెత్తింది. దీంతో శుక్రవారం రాత్రి అధికారులు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ గేట్లను ముందస్తు హెచ్చరిక చేయకుండానే ఎత్తేయడంతో దిగువన ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగిపోయింది. వెంటనే స్పందించిన హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎస్ విభాగాలు.. మూసీ వెంట ఉన్న కాలనీల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అధికారులు, పోలీసులు మూసీ పరీవాహక ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాల వరద బాధితులకు హెలికాప్టర్, డ్రోన్ల ద్వారా ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

**మూసీ పరివాహక ప్రాంతాల్లో రెడ్ అలెర్ట్**

మూసీ పరివాహక ప్రాంతాల్లో నీరు చేరుతుందన్న సమాచారంతో రెవెన్యూ, జీహెచ్ఎంసీ పోలీసు శాఖలు అప్రమత్తమయ్యాయి. ముఖ్యంగా చాదర్‌ఘాట్, శంకర్‌నగర్, గోల్నాక డివిజన్ పరిధిలోని కృష్ణానగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాల ప్రజలను అధికారులు సురక్షిత ప్రదేశాలకు తరలించారు. పాఠశాల భవనాలు, కమ్యూనిటీ హాల్స్‌ను పునరావాస కేంద్రాలుగా మార్చి బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందిస్తున్నారు. నది ఉధతి పెరగడంతో ముసారంబాగ్ బ్రిడ్జిని మూసేశారు. రాకపోకలను నిలిపేశారు. జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు.

# పేరెంట్స్‌ను నిర్లక్ష్యం చేయొద్దు

(మొదటి పేజి తరువాయి)

శనివారంనాడిక్కడి శిల్పకళావేదికలో గ్రూప్-1 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందచేశారు. మొత్తం 563 గ్రూప్-1 పోస్టులకుగాను 562 మంది అభ్యర్థులను టీజీపీఎస్సీ 18 శాఖలకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తెలంగాణ గడ్డకు చరిత్ర, పౌరుషం ఉన్నాయనీ, ఏమారుమూల పల్లె, తండా, గ్రామానికి వెళ్లినా ఆ స్ఫూర్తి కనిపిస్తుందన్నారు. సామాజిక న్యాయం. సమాన అవకాశాల కోసం తెలంగాణలో అనేక పోరాటాలు ఇదే చైతన్యంతో జరిగాయని వివరించారు. పదేండ్లు అధికారంలోఉన్నా, గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వకుండా, నిరుద్యోగుల్ని ఏమాత్రం పట్టించుకోకుండా, నిర్లక్ష్యంతో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి నమ్మకద్రోహులుగా మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. ఆరు దశాబ్దాల ఉద్యమాన్ని ఒకే కుటుంబం, ఒకే పార్టీకి ఆపాదించుకోవాలని చూశారనీ, ప్రజలు రెండు సార్లు గెలిపించేసరికి కారణజన్ములమనుకుని విర్రవీగారని విమర్శించారు. అలాంటి విశ్వాసఘాతకులు ఉద్యమకారులు ఎలా అవుతారని ప్రశ్నించారు. పదేండ్ల పాలనలో టీజీపీఎస్సీని అంగడిసరుకుగా మార్చారనీ, దానిలో ఆర్ఎంపీ డాక్టర్‌ను సభ్యుడిగా నియమించి, ప్రశ్నాపత్రాలను జిరాక్స్ కేంద్రాల్లో అమ్ముకున్నారని ఆక్షేపించారు.

టీజీపీఎస్సీని యూపీఎస్సీ కంటే మెరుగ్గా తీర్చిదిద్దామనీ, ఉన్నత హోదాల్లో ఉన్న వారిని చైర్మెన్లు, సభ్యులుగా నియమించామని గుర్తు చేశారు. టీజీపీఎస్సీ రాజకీయ పునరావాస కేంద్రం కాదని చెప్పారు. కొందరు కడుపు నిండా విషం పెట్టుకుని అభ్యర్థులను దెబ్బతీయాలనుకున్నారని వ్యాఖ్యానించారు. గ్రూప్-1 పోస్టుల్ని రూ.రెండు కోట్లు, మూడు కోట్లకు అమ్ముకున్నానని తనపై కొందరు ఆరోపణలు చేశారని చెప్పారు. అసలు ఏనాడైనా మీతో కలిసి చారు అయినా తాగానా?అని ప్రశ్నించారు. 2023 డిసెంబర్‌లో కూడా ఇంత ఆందోళన చెందలేదనీ, గ్రూప్-1 నియామకాల విషయంలో ఆందోళన చెందానని అన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల భవిష్యత్తే, తెలంగాణ భవిష్యత్ అని చెప్పారు. ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి దేశానికే ఆదర్శంగా తెలంగాణ మోడల్‌ను తయారు చేయాలని కోరారు. కోచింగ్ సెంటర్ల కుట్రను అర్థం చేసుకోవాలనీ, హైకోర్టులో వాదించిన న్యాయవాదుల వెనుక ఎవరున్నారో తెలుసుకోవాలన్నారు. 2011లో గ్రూప్-1 నోటిఫికేషన్ వస్తే, 2018లో నియామకాలు జరిగాయని గుర్తు చేశారు. కానీ తాము అధికారంలోకి వచ్చిన 19 నెలల్లో నోటిఫికేషన్ ఇచ్చి, నియామకాలను పూర్తి చేశామన్నారు.

# హైదరాబాద్ వరద బాధితులకు అండగా నిలవండి..

**జనసేన శ్రేణులకు, అభిమానులకు పవన్ పిలుపు**

హైదరాబాద్ **సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త) :**
తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పందించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొని, బాధితులకు అండగా నిలవాలని తెలంగాణ జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాల కారణంగా జనజీవనం స్తంభించిపోయిందని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా, హైదరాబాద్‌లో మూసీ నదికి వరద పోటెత్తడంతో మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) సహా లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో వరద బాధితులకు మనోధైర్యం కల్పించడం అత్యవసరమని ఆయన అన్నారు.

జనసేన శ్రేణులు తక్షణమే స్పందించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని దిశానిర్దేశం చేశారు. బాధితులకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ వారికి ధైర్యం చెప్పాలని సూచించారు.

ఇదే సమయంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సహాయక చర్యలను ముమ్మరంగా చేపట్టిందని పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న సహాయక కార్యక్రమాలకు ఆటంకం కలగకుండా జనసైనికులు తమ వంతు సాయం అందించాలన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం జారీ చేసే సూచనలతో పాటు వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎపిలో పర్యాటక అభివృద్ధికి పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలో నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ సదస్సులో సీఎం మాట్లాడారు. మా చిన్నప్పుడు గుడికి వెళ్లడమే టూరిజం అనుకునేవాళ్లం. పర్యాటకం విషయంలో ప్రజల ఆలోచనలు మారాయి. ఆ ఇజం.. ఈ ఇజం లేదు.. ఇప్పుడు ప్రతిచోటా టూరిజం. ప్రపంచంలో ఎక్కువ మంది టూరిస్టులు భారత్ నుంచే వెళ్తున్నారు. మన దేశంలో ఉన్న పర్యాటక కేంద్రాలు ప్రపంచంలో మరెక్కడా లేవు. దేశీయ పర్యాటకులను ఆకర్షిస్తే చాలు.. వివిధ రకాల ఆదాయం వస్తుంది. అందరితో చర్చించి మెరుగైన టూరిజం పాలసీ తీసుకొచ్చాం. పర్యాటక కేంద్రాల్లో పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలు జరిగేలా చూడాలి. పర్యాటకులు కొన్ని రోజులు ఉండేలా చూడాలి. ఇప్పుడు వెల్‌నెస్ సెంటర్లకు డిమాండ్ పెరుగుతోంది. పర్యాటక కేంద్రాలను బాగా మార్కెటింగ్ చేసుకోవాలన్నారు. కూచిపూడి, కొండపల్లి, ఏటికొప్పాకను అభివృద్ధి చేస్తాం. గండికోట,

అరకులో ఉత్సవాలు నిర్వహించాం. దసరా అంటే కోల్‌కతా, మైసూరే కాదు.. విజయవాడ కూడా గుర్తుకు రావాలి. దేశంలోనే నెంబర్ వన్ సిటీ-గా విజయవాడ నగరం మారతుంది. రాయలసీమలో టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తున్నాం. మనకు తిరుపతి, శ్రీశైలం, మంత్రాలయం, కాణిపాకం శ్రీకాళహస్తి ఉన్నాయని సీఎం వివరించారు. ఈ సందర్భంగా పర్యాటకశాఖ హోమ్ స్టే పోర్టల్‌ను సీఎం ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు కందుల దుర్గేష్, సత్య కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బోండా ఉమా తదితరులు పాల్గొన్నారు. ఏపీలో పర్యాటక రంగానికి స్వర్ణ యుగం లాంటి దశ, దిశను సీఎం చంద్రబాబు కల్పిస్తున్నారని మంత్రి కందుల దుర్గేష్ వ్యాఖ్యానించారు. 15 నెలల కాలంలో పర్యాటక రంగానికి పూర్వ వైభవం వచ్చిందని ఉద్ఘాటించారు. శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఏపీ కార్వాన్ టూరిజం బస్సులను పరిశీలించారు సీఎం. బస్సులో ఉన్న సౌకర్యాలు, వసతులు గురించి సీఎంకు వివరించారు అధికారులు. బస్సులో డైనింగ్ తరహా ఏర్పాట్లు- కూడా ఉంటే బాగుంటుందని సూచించారు సీఎం. ప్రజల అభిప్రాయాలను కూడా తీసుకుని.. అవసరమైతే మార్పులు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ ప్రసంగించారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేలా సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని చెప్పుకొచ్చారు. ప్రకృతి అందాలను అభివృద్ధి చేయడం ద్వారా నేడు అద్భుతమైన ప్రదేశాలుగా మారాయని వివరించారు. పర్యాటక రంగంలో సుస్థిరమైన మార్పు వచ్చిందని చెప్పడానికి ఏపీ ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు. క్యాపిటల్, సోషలిజం, కమ్యూనిజం గురించి చాలా మంది మాట్లాడతారని.. కానీ వాటి గురించి మనకు వద్దని.. మనం టూరిజం గురించి మాట్లాడదామని పిలుపునిచ్చిన ఏ-కై-క నాయకులు చంద్రబాబు అని గుర్తుచేశారు మంత్రి కందుల దుర్గేష్. చంద్రబాబు కారణంగా నేడు రూ.10,644 కోట్ల పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కూడా పర్యాటక రంగానికి నిధులు ఇచ్చి సహకరిస్తుందని తెలిపారు. నేడు కొత్త కొత్త పాలసీల విధానాలను తెచ్చి అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేస్తూ.... సరికొత్త పర్యాటక ప్రాంతాలను ఆవిష్కరిస్తున్నారని చెప్పుకొచ్చారు. కార్వాన్ టూరిజం బస్సుల ప్రత్యేకతలను ఇప్పుడు అందరూ చూశారని తెలిపారు. పర్యాటక శాఖలో ఉన్న అధికారుల టీమ్ సమష్టిగా పని చేస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నారని ప్రశంసించారు. తమ వెనుకాల చంద్రబాబు ఉంటూ.. ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తున్నందుకు ఆయనకు పర్యాటక శాఖ తరపున ధన్యవాదాలు తెలిపారు మంత్రి కందుల దుర్గేష్. ప్రపంచ పర్యాటక దినోత్సవం.. ఇదే రోజు 2000 సంవత్సరంలో చంద్రబాబుతో కలిసి ఆయన ఆలోచనలు పంచుకున్నానని ఐఏఎస్ అధికారి అజయ్ జైన్ గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు 25 ఏళ్ల తర్వాత నేడు మళ్లీ టూరిజం కొత్త పాలసీని ఏపీలో అమలు చేస్తున్నామని ఉద్ఘాటించారు. ఇప్పుడు చంద్రబాబు ద్వారా టూరిజం గైడ్ లైన్స్‌ను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. పర్యాటక రాష్ట్రంగా అభివృద్ధి చేసేందుకు అనేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని వివరించారు. ఈ ఏడాది ఏపీ వ్యాప్తంగా 8 మెగా ఈవెంట్లు-, ప్రతి జిల్లాలో ఈవెంట్లు- నిర్వహించామని తెలిపారు. టూరిజంలో 20శాతం గ్రోత్ తీసుకురావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని.. అదే లక్ష్యంతో పని చేస్తున్నామని నొక్కిచెప్పారు. దేశవ్యాప్తంగా టూరిజం అభివృద్ధిలో ఏపీ నెంబర్ వన్‌గా ఉండాలనేది తమ టార్గెట్ అని ఐఏఎస్ అధికారి అజయ్ జైన్ పేర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ నెట్‌వర్క్...

## ఒడిశాలో లాంఛనంగా సేవలను ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

ఒడిశా **సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త) :**
ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్వదేశీ 4జీ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చింది. శనివారం ఒడిశాలోని ఝార్సుగూడలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. పూర్తి భారతీయ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ 'భారత్ టెలికాం స్టాక్' నెట్‌వర్క్‌ను జాతికి అంకితం చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టం ద్వారా టెలికాం రంగంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం దిశగా దేశం ఒక కీలక మైలురాయిని అధిగమించింది.ఈ కార్యక్రమంలో భాగంగా, సుమారు రూ.37,000 కోట్ల వ్యయంతో, సౌరశక్తితో పనిచేసే 97,500 మొబైల్ 4జీ టవర్లను ప్రధాని మోదీ ప్రారంభించారు. దేశంలోని ప్రతి గ్రామానికి 4జీ సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన '100 శాతం 4జీ సాచురేషన్ ప్రాజెక్టు'కు కూడా ఆయన శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఒడిశాలోని 2,472 గ్రామాలతో సహా దేశవ్యాప్తంగా సరిహద్దు, మారుమూల, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లోని 26,700కు పైగా గ్రామాలకు తొలిసారిగా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో సుమారు 2.2 కోట్ల మంది పౌరులకు ప్రయోజనం చేకూరనుంది.

**భారత టెక్ దిగ్గజాల భాగస్వామ్యం**

ఈ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ రూపకల్పనలో బీఎస్ఎన్ఎల్‌తో పాటు దేశీయ టెక్ దిగ్గజాలైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (సీ-డాట్), తేజస్ నెట్‌వర్క్స్ లిమిటెడ్ కీలక పాత్ర పోషించాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా టీసీఎస్ డేటా సెంటర్ల ఏర్పాటు, నెట్‌వర్క్ నిర్వహణ వంటి బాధ్యతలను నిర్వర్తించగా, సీ-డాట్ కోర్ అప్లికేషన్‌ను, తేజస్ నెట్‌వర్క్స్ బేస్ స్టేషన్లు, రేడియో పరికరాలను అందించాయి. లక్షకు పైగా సైట్లలో ఈ స్వదేశీ పరికరాలను విజయవంతంగా నెలకొల్పారు. ఈ నెట్‌వర్క్ పూర్తిగా క్లౌడ్ ఆధారితమైనది కావడంతో, భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేసేందుకు వీలుంటుందని అధికారులు తెలిపారు.ఈ విజయంతో, సొంతంగా 4జీ, ఆపై టెక్నాలజీలను అభివృద్ధి చేసిన డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనా వంటి అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది. టెలికాం పరికరాల కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించి, జాతీయ భద్రతను బలోపేతం చేయడంలో ఇది కీలక ముందడుగు అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**గ్రామీణ భారత్‌కు డిజిటల్ వరం**

ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ జె. రవి మాట్లాడుతూ, "ఇది జాతి గర్వించదగ్గ చారిత్రాత్మక విజయం. టీసీఎస్, తేజస్ నెట్‌వర్క్స్, సీ-డాట్ భాగస్వామ్యంతో నిర్మించిన మా స్వదేశీ 4జీ నెట్‌వర్క్, ఆత్మనిర్భర్ భారత్ నినాదానికి నిలువుటద్దం" అని అన్నారు. టీసీఎస్ సలహాదారు, తేజస్ నెట్‌వర్క్స్ ఛైర్మన్ ఎన్. గణపతి సుబ్రమణియం మాట్లాడుతూ, "సొంతంగా టెలికాం టెక్నాలజీని అభివృద్ధి చేసిన అతికొద్ది దేశాల సరసన భారత్‌ను నిలబెట్టడం మాకు గర్వకారణం. బీఎస్ఎన్ఎల్‌లో ఈ నెట్‌వర్క్‌ను విజయవంతంగా వ్యవస్థీకృతం చేయడం దేశంలోని ప్రతి మూలకు శక్తివంతమైన డేటా, వాయిస్ నెట్‌వర్క్‌ను తీసుకెళ్లడంలో చరిత్రాత్మకమైనది" అని వివరించారు.గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్య, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులు, 24 గంటల టెలిమెడిసిన్ వంటి సేవలు అందుబాటులోకి రావడానికి ఈ నెట్‌వర్క్ దోహదపడుతుంది. ప్రధాని మోదీ కలలు కన్న 'డిజిటల్ ఇండియా' లక్ష్య సాధనలో ఈ స్వదేశీ 4జీ నెట్‌వర్క్ ఒక మైలురాయిగా నిలిచిపోతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# కాంగ్రెస్ బాకీ కార్డ్ ఉద్యమం

## ఆ పార్టీ మోసాలను వివరించేందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ **సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త) :**
కాంగ్రెస్ చేసిన మోసాలను రాష్ట్ర ప్రజలకు వివరించేందుకు 'కాంగ్రెస్ బాకీ కార్డ్' ఉద్యమం మొదలు పెట్టినట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఏ వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత బాకీ ఉందో తెలిపేలా ఉద్యమం ఉంటుందని చెప్పారు. హామీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్ కు పంచాయతీ, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మాజీ మంత్రులతో కలిసి హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో 'కాంగ్రెస్ బాకీ కార్డు' పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారం కోసం కాంగ్రెస్ అడ్డమైన హామీలిచ్చిందని విమర్శించారు. గద్దెనెక్కిన తర్వాత వాటిని గాలికొదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై బీఆర్ఎస్ పార్టీ సమరశంఖం పూరించిందని ప్రకటించారు. ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారెంటీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలోని ఏ వర్గానికి ఎంతెంత బాకీ పడిందో లెక్కలతో సహా ప్రజల ముందుంచేందుకు 'కాంగ్రెస్ బాకీ కార్డు' ఉద్యమాన్ని మొదలుపెట్టినట్టు తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీ కార్డుకు విరుగుడే ఈ 'బాకీ కార్డు' అని హెచ్చరించారు. తమను మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పే అవకాశం ప్రజలకు వచ్చిందని తెలిపారు. బాకీ కార్డును బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఇంటికి తీసుకెళ్తారని చెప్పారు.కాంగ్రెస్‌ను నమ్మితే ప్రజలు మోసపోతారని కేసీఆర్ ముందు చెప్పిందే నేడు నిజమైందని తెలిపారు. మొదటి క్యాబినెట్‌లోనే హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 30కి పైగా క్యాబినెట్ సమావేశాలు నిర్వహించినా ఆ ఊసే లేదని ఎద్దేవా చేశారు. బాకీ కార్డులో ప్రతి అక్షరం రేవంత్ సర్కార్ మోసానికి నిలువుటద్దమని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని అన్ని వర్గాలను నిలువునా ముంచిందని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఎకరాకు రూ.15 వేలు, రూ.2 లక్షల రుణమాఫీ, వరికి రూ.500 బోనస్, కౌలు రైతులు, రైతు కూలీలకు రూ.15 వేలు, రూ.12 వేలు ఇస్తామన్న హామీల మేరకు అవి బాకీలు కావా? అని ప్రశ్నించారు. 2 లక్షల ఉద్యోగాల హామీ, నెలకు రూ.4 వేలు నిరుద్యోగ భృతి హామీకి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఒక్కో మహిళకు నెలకు రూ.2,500 హామీ మేరకు రూ.55 వేల చొప్పున, పెళ్లైన ఆడబిడ్డలకు తులం బంగారం హామీ మేరకు 8 లక్షల మంది ఆడబిడ్డలకు 8 లక్షల తులాల బంగారం ఇవ్వకపోవడం నయవంచన కాదా? అని మండిపడ్డారు. వృద్ధులు, వితంతువులకు నెలకు రూ.4 వేల పెన్షన్ హామీ మేరకు ఒక్కొక్కరికి రూ.44 వేలు, వికలాంగులకు నెలకు రూ.6 వేలు హామీ మేరకు ఒక్కొక్కరికి రూ.44 వేలు బాకీ ఉన్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, విద్యార్థినులకు స్కూటీలు, యువతకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డులు, ఆటో డ్రైవర్లకు రూ.24 వేలు బాకీ ఉందని కేటీఆర్ తెలిపారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
శనివారం 27 సెప్టెంబర్ 2025

## స్థానిక సంస్థల ఎన్నికల బిజెపి పార్టీ మండల
# కోఆర్డినేటర్ గా తుమ్మల శ్రీనివాస్



**బయ్యారం/సెప్టెంబర్27 (జర్నలిస్ట్ వార్త):** మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల బిజెపి పార్టీ మండల కోఆర్డినేటర్ గా తుమ్మల శ్రీనివాస్ నియమితులైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని కార్యకర్తలు,నాయకులు సమిష్టి కృషితో ముందుకు సాగాలని వారు కోరారు. మండల కోఆర్డినేటర్ పదవి నియామకం పట్ల రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు,జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్ నియామకం పట్ల మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## రుద్ర సేవాసమితి ఆధ్వర్యంలో ప్రజలకు చేయూత




**బయ్యారం/సెప్టెంబర్ 27(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని ఉప్పలపాడు గ్రామ పంచాయతీ జనార్ధనపురం గ్రామానికి చెందిన రుద్ర సేవాసమితి, రుద్ర ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జనార్ధనపురం గ్రామంలో ఇటీవల వీసారపు భాగ్యమ్మ మరణించారు. ఈ సందర్భంగా ఆమె కుమారుడు వీసారపు విజయ్ రెడ్డి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ రుద్రాసేవ సమితి ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ తెలుగుదేశంపార్టీ రాష్ట్ర నాయకునికి ఘన సత్కారం



**ఖమ్మం/సెప్టెంబర్27(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ తెలుగుదేశంపార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, అజ్మీరా రాజు నాయక్ విజయవాడలోని కనకదుర్గా అమ్మవారిని దర్శనం చేసుకుని ఖమ్మం మీదుగా తిరుగు ప్రయాణంలో శనివారం ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ని మధిర లోని తన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని దసరా శుభాకాంక్షలు తెలిపారు, అనంతరం తెలుగుదేశంపార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో హడ్ హక్ కమిటీ సభ్యులు మాజీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ చంద్ర ని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు, హరీష్ , జిల్లా కార్యాలయనికి వచ్చిన రాజు నాయక్ కి ఘనంగా శాలువాతో సత్కరించి కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి జై, నాగండ్ల లక్ష్మణ్, కొలికొండ మురళి, వక్కంతుల వంశీ, కన్నెటి పృథ్వీ, కొల్లు పూర్ణ, దామాల శివ, తదితరులు ఉన్నారు.

## పులి అంజయ్య కు శ్రీనివాస్ రెడ్డి పరామర్శ



**రాయపర్తి/సెప్టెంబర్ 27(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పులి అంజయ్య హన్మకొండ లోని గార్డియన్ హాస్పిటల్ కాలుకు చికిత్స చేసుకోగా శనివారం ఆయనను ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్,బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు పరు పాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి 3000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,మాజీ సర్పంచ్ కర్ర రవీందర్ రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు లేతకుల మధుకర్ రెడ్డి, గజవెల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన గోవిందు శ్రీనివాసరావును సన్మానించిన కాంగ్రెస్ నాయకులు..



**తల్లాడ/సెప్టెంబర్27(జర్నలిస్ట్ వార్త):** మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన గోవిందు శ్రీనివాసరావును తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా తల్లాడలో ఆయనను శాలువాలు పూలమాలలతో సన్మానించి సత్కరించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతో పాటు మున్నూరు కాపు సంఘంలో చురుగ్గా పాల్గొనే శ్రీనివాసరావుకు ఈ పదవి రావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల లచ్చిరెడ్డి, మారెళ్ళ మల్లికార్జునరావు, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, వడ్డే రామారావు, లక్ష్మీపురం మాజీ సర్పంచ్ ఓబుల సీతారామిరెడ్డి, నాయకులు బొడ్డు వెంకటేశ్వర రావు, బండి బాలసౌరి, గుజ్జర్లపూడి చింటూ, తాళ్ల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా ఎవరిది?

## అధికార పార్టీదా? ప్రతిపక్ష పార్టీదా? అంటూ పల్లెల్లో చర్చలు


**ఖమ్మంబ్యూరో/సెప్టెంబర్27 (జర్నలిస్ట్ వార్త):**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా ఎవరిది అంటూ మండల వ్యాప్తంగా ఉన్న పల్లెల్లో జోరుగా చర్చలు సాగుతున్నవి గతంలో చూసుకుంటే అధికారంలో ఉన్న బి ఆర్ఎస్ పార్టీ సత్తా చాటి అన్ని స్థానాలను కైవసం చేసుకుంది అలా కైవసం చేసుకోగ అతి ఉత్సాహంతో ఆనందంతో పగ్గాలు చేపట్టిన సర్పంచ్లకు బి ఆర్ఎస్ ప్రభుత్వంలో చేదు అనుభవం ఎదురయింది వారు చేసినటువంటి అభివృద్ధి పనులకు పెట్టినటువంటి పైసలకు బిల్లులు రాక గత ప్రభుత్వం బిల్లులు శాంక్షన్ చేయక ఎన్నో ఇబ్బందులు పడ్డారు కొందరు సర్పంచులు పదవి కాలం అయిపోయిన తర్వాత కూడా బి ఆర్ఎస్ ప్రభుత్వంతో ఎంతో వాదన పెట్టుకొని ఎన్నో ధర్నాలు రాస్తారోకోలు చేశారు అంటూ కొందరు మేధావులు



చర్చించుకుంటున్నారు ఇలాంటి సమయంలో ప్రతిపక్ష పార్టీ అయినటువంటి బి ఆర్ఎస్ పార్టీ మునుముందు జరగబోయేటటువంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతుందా అంటూ చర్చలు జోరుగా సాగుచున్నవి ఇదిలా ఉండగా ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలలో కొన్ని అమలు చేసి మరికొన్ని అమలు చేసేటందుకు అడుగులు ముందుకు వేస్తున్న తరుణంలో కొంతమంది ప్రజలకు అసంతృప్తిగా ఉంది అంటూ కొందరు ప్రజలు తెలుపుతున్నారు. మరికొందరు ప్రజలు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టినటువంటి పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నవి ఆ పథకాలే జరగబోయేటటువంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు తోడ్పాటుగా కాబోతున్నయంటూ మండలంలో చర్చలు జోరుగా సాగుచున్నవి ఏది ఏమైనా మునుముందు జరగబోయేటటువంటి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు ఎవరిది ప్రతిపక్ష పార్టీదా? అధికార పార్టీదా? అనేది తెలియాలి అంటే ప్రజలు వేచి చూడక తప్పదు అంటున్నారు కొందరు మేధావులు

## జాతీయస్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలు

### జిల్లా నోడల్ అధికారి, నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్





**నర్సంపేట/సెప్టెంబర్27 (జర్నలిస్ట్ వార్త):**
రాబోయే ఆడిట్ దివాస్ - 2025 ని పురస్కరించుకొని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్)నాలుగవ జాతీయస్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలను ఆన్లైన్ పద్ధతిలో నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ కమీషనర్ ఆదేశానుసారం వరంగల్ జిల్లా కాలేజీయేట్ ఎడ్యుకేషన్ నోడల్ అధికారి, నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ ఒక ప్రకటనలో కళాశాలలోని విద్యార్థిని విద్యార్థులు15 నుంచి 29 సంవత్సరాల (ఆగస్ట్ 1 నాటికి)మధ్య వయసు కలిగిన వారు దీనికి అర్హులు అని, వారు తప్పనిసరిగా మై భారత్ పోర్టల్లో రిజిస్టర్ అయ్యి తమ పేరును నమోదు చేసుకోవాలని తెలియజేశారు. వ్యాసరచన పోటీలు హిందీ,ఇంగ్లీష్ మాధ్యమాలలో ఉంటాయని ఎన్నికైన వారికి మొదటి బహుమతిగా 50, 000 రెండవ బహుమతిగా 40 వేలు మూడవ బహుమతిగా 30 వేల రూపాయలు అందజేయబడుతుందని దీనికిగాను ఎంపిక చేయబడిన అంశం "సుపరిపాలన, జవాబుదారితనం, పారదర్శకత అందివ్వడంలో కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ యొక్క పాత్ర(కాగ్)"అంశంపై 1500 పదాలకు మించకుండా వ్యాసాన్ని రాసి పంపవలసి ఉంటుందని, క్విజ్ పోటీల గాను ప్రతి విద్యార్థి వ్యక్తిగతంగా నమోదు చేసుకొని పాల్గొనాలని పేర్కొంటూ ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థిని,విద్యార్థులు ఉపయోగించుకోవాలని తెలిపారు.

# 6వ రోజు అన్నపూర్ణ దేవి అవతారంలో దుర్గాదేవి



**స్టేషన్ ఘన్పూర్/సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
మండలంలోని తాటికొండ గ్రామంలో గల శ్రీ కనకదుర్గా దేవి అమ్మవారి దేవాలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవముల సందర్భంగా అరవ రోజు శనివారం శ్రీ అన్నపూర్ణదేవి అవతరంలో దుర్గాదేవి దర్శనమిచ్చా రు. ఈసందర్భంగా అమ్మవారికి పంచామృతఅభిషేకం, నిత్యహోమం,నిత్య పూర్ణాహుతి, కుంకుమార్చన తదితర పూజలు అర్చకుడు జీడికంటి వరుణాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై లలిత దేవి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు తీసుకున్నా రు. ఈ కార్యక్రమంలో అర్చకుడు జీడి కంటి వరుణా చార్యులు, దేవలయ ధర్మకర్తల మండలి సభ్యులు, భవాని మాల దీక్ష తీసుకున్న సభ్యులు, భక్తులు మహి ళలు, తదితరులు పాల్గొన్నారు.



## ఏఈగా పనిచేస్తూనే డిఎస్పీగా
## కొలువు సాధించిన హిమ వర్షిణి రెడ్డి..



**సత్తుపల్లి/సెప్టెంబర్27(జర్నలిస్ట్ వార్త):**
సత్తుపల్లి పట్టణానికి చెందిన గోలి హిమ వర్షిని రెడ్డి గ్రూప్ వన్ ఫలితాలలో డిఎస్పీగా ఎంపిక అవడం పట్ల సత్తుపల్లి పట్టణ ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు. సత్తుపల్లి కి చెందిన గోలి హిమ వర్షిని రెడ్డి గ్రూప్ వన్ ఫలితాలలో డిఎస్పిగా ఎంపిక అయింది. బీటెక్ పూర్తి చేసిన ఆమె ప్రస్తుతం పంచాయతీరాజ్ శాఖలో ఏఈగా హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నారు. ఆమె తండ్రి శ్రీనివాస్ రెడ్డి ఎల్ఐసి ఏజెంట్గా పని చేస్తున్నారు. డీఎస్పీగా ఎంపికైన హిమ వర్షిని పలువురు ప్రముఖులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి దయానంద్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సివిల్స్ సాధించేవరకు పట్టు విడవనని గ్రూప్ వన్ ఫలితాల్లో డిఎస్పి ఉద్యోగానికి ఎంపికైన గోలి హిమ వర్షిణి రెడ్డి అన్నారు. అనుకున్న విధంగానే గ్రూప్-1 ఫలితాలలో ఉద్యోగం సాధించడం పట్ల తను మాట్లాడుతూ పట్టుదల ఉంటే సాధించనది ఏమీ లేదంటూ తెలియజేశారు. ఈ సందర్భంగా డిఎస్పీగా ఉద్యోగం సాధించిన హిమ వర్షిని రెడ్డిని పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## ధర్మసాగర్లో రిజర్వేషన్లతో
# రాజకీయ చర్చలు వేడెక్కుతున్నాయి

**హనుమకొండ బ్యూరో/ సెప్టెంబర్27(జర్నలిస్ట్ వార్త)**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలో సర్పంచ్, జెడ్పిటిసి, ఎంపిటిసి స్థానాల రిజర్వేషన్లు ఖరారవ్వడంతో రాజకీయ వాతావరణం కాసేపట్లోనే వేడెక్కింది. ఏ గ్రామంలో ఏ వర్గానికి రిజర్వేషన్ ఖరారయ్యిందనే అంశంపై నేతల మధ్య జోరుగా చర్చలు సాగుతున్నాయి. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన రిజర్వేషన్ జాబితా ప్రకారం గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ స్థానాల్లో సామాజిక వర్గాల వారీగా హక్కులు నిర్ణయించబడ్డాయి. దీంతో రాబోయే ఎన్నికల్లో ఎవరి బలపరీక్ష ఎలా ఉండబోతుందన్న దానిపై స్థానిక నాయకులు కూర్చుని వ్యూహరచనలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అధికార పక్షానికి అనుకూలంగా రిజర్వేషన్ పడిందని, మరికొన్ని చోట్ల ప్రతిపక్షానికి అవకాశం లభించిందని గ్రామస్థాయి రాజకీయ నాయకులు తమ లెక్కలు వేసుకుంటున్నారు. ఇప్పటికే అభ్యర్థుల రేసు ఊపందుకోవడంతో ధర్మసాగర్ మండలంలోని రాజకీయ సమీకరణాలు మరింత రసవత్తరంగా మారాయి.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



## భారీ వర్షాల నేపథ్యంలో ఖమ్మం... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ల తో మాట్లాడిన మంత్రి తుమ్మల.



**ఖమ్మం/సెప్టెంబర్ 27(జర్నలిస్ట్ వార్త):** గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ పాటిల్ కు ఆదేశం.భద్రాచలం వద్ద గోదావరి నది వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో పరివాహక ప్రాంతాలలో గల లోతట్టు గ్రామాల ప్రజలను అలర్ట్ చేయాలని, రైతులు పశువులు కాపరులు వాగులు వంకలు దాటకుండా కట్టడి చేయాలని అందుకోసం పోలీస్ సిబ్బంది సేవలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ను మంత్రి తుమ్మల ఆదేశించారు. ఎగువ నుంచి భారీగా గోదావరి వరద ఉధృతి ఉన్నందున భద్రాచలం వద్ద గల కరకట్ట స్లూయిస్ లీకేజ్ కాకుండా, పట్టణంలో వర్షపు నీరు కరకట్ట వద్ద నిలవకుండా ఎత్తి పోసే మోటార్లను సిద్ధంగా ఉంచాలని, అత్యవసర వైద్య సేవలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ కు మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు

## కొండా లక్ష్మణ్ బాపూజీ తొలితరం ఉద్యమ నాయకుడు

### -సూరం సుధాకర్ రెడ్డి.



**బయ్యారం/సెప్టెంబర్ 27(జర్నలిస్ట్ వార్త):** కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన తొలితరం ఉద్యమ నాయకుడని,తెలంగాణ ఉద్యమంతో పాటు అనేక ఉద్యమాల్లో క్రియాశీలకంగా నిలిచారని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సూరం సుధాకర్ రెడ్డి తెలిపారు.కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం భావి తరాలకు ఆదర్శనీయం.శనివారం బాపూజీ జయంతి సందర్భంగా ఘనంగా నివాళు లర్పించారు.బడుగు,బలహీన వర్గాల సంక్షేమమే పరమావధిగా,తన జీవిత కాలం అంతా ప్రజల సామాజిక న్యాయం కోసమే పరితపించారని సుధాకర్ రెడ్డి ప్రశంసించారు.

## శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో దుర్గాదేవి



**స్టేషన్ ఘన్పూర్/సెప్టెంబర్27 (జర్నలిస్ట్ వార్త):** చిల్పూర్ మండలంలోని కృష్ణాజి గూడెం గ్రామంలో గల శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవముల సందర్భం గా ఆరవరోజు శనివారం శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అవతరంలో దుర్గాదేవి దర్శనమిచ్చారు. ఈ సందర్భం గా అమ్మవారికి పంచామృత అభిషేకం, నిత్యహోమం, నిత్య పూర్ణాహుతి, కుంకుమార్చన తదితర పూజలు అర్చకుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం తీర్థ ప్రసాద వితరణ నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అమ్మవారిని దర్శించుకు ని తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు వడ్లకొండ యాదగిరి, రాజహంస, వేముల జ్యోతి, వెంకటేశ్వర్లు, కోరిపెల్లి మల్లారెడ్డి, రాజహంస, శేఖర్, ప్రకాష్, గణేష్, రాకేష్, వడ్లకొండ లక్ష్మయ్య, లింగయ్య, సాదం రాజకుమార్,కోతి మురళి, మాదవి, ఊరడి రాజు, విజయలక్ష్మి,వెంకటేశ్వర్లు,అజయ్,చారి, సౌమ్య,లక్ష్మి, శ్రీదేవి, వెన్నెలరెడ్డి తదితరులు పాల్గొన్నా రు.

## బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ చల్లా ఉమా సుధీర్ రెడ్డి



**స్టేషన్ ఘన్పూర్/సెప్టెంబర్27 (జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని తాటికొండ గ్రామంలో గల రైతు వేదిక లో మన తెలంగాణ సాంస్కృతిక చిహ్నం బతుకమ్మ సంబరాలు వేడుకల్లో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం ఏడవ రోజు వేపకాయ బతుకమ్మ సందర్భంగా బతుకమ్మ వేడుక లు ఘనంగా నిర్వహించారు. తాటికొండ గ్రామంలో గల రైతు వేదికలో ఏర్పాటుచేసిన బతుకమ్మ వేడుకల కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చల్లా ఉమాసుధీర్ రెడ్డి, ఎంపిడిఓ విజయ శ్రీ, పంచాయతీ సెక్రెటరీ ఏదునూరి సత్యనారాయణ, అంగన్వాడి టీచర్ లు నారబోయిన పద్మ, మారపాక ధనలక్ష్మి,మారపాక సులోచన, కుసు మ అరుణ, వివోఏ ఉమ్మగొని సుమతి, మారపాక హైమావతి, ఫీల్డ్ అసిస్టెంట్ రేణుక, మహిళా సంఘ సభ్యురాలు,గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో ప్రాంగణంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

### బతుకమ్మ ఆటపాటలతో దద్దరిల్లిన ప్రాంగణం -మహిళా ఉద్యోగుల్లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు








**పర్వతగిరి సెప్టెంబర్27(జర్నలిస్ట్ వార్త):** బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా శనివారం మండలంలోని ఎంపీడీవో ప్రాంగణంలో మదర్ తెరిసస్సా మండల సమైక్య ఏపీఎం రాజీర్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు నిర్వహించిన బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. మండలంలోని వివిధ గ్రామాల్లోని గ్రామైక్య సంఘాల ఉద్యోగులతోపాటు ఎంపీడీవో తాసిల్దార్, మండల సమైక్య కార్యాలయాల మహిళా ఉద్యోగులు తంగేడు, గునుగు, బంతి, చామంతి మొదలగు తిరక్క పువ్వులతో బతుకమ్మలను అలంకరించి గౌరమ్మను పూజించారు. బతుకమ్మ మైదానమును తలపించే విధంగా వివిధ శాఖల మహిళా ఉద్యోగులు బతుకమ్మలతో ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోనికి తరలిరావడంతో బతుకమ్మ ఆటపాటలతో ప్రాంగణమంతా దద్దరిల్లింది. స్వీట్లు పంచుకొని సంతోషాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈజిఎస్ ఏపీవో సుశీల్ మదర్ తెరిసా మండల సమైక్య అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులు స్వప్న రజిత ఫరీదా సీసీ దేవేంద్ర ఎమ్మెస్ సిబ్బంది రాధిక అరుణ వివిధ శాఖల మహిళా ఉద్యోగులు సెర్ప్ సిబ్బంది గోలి కొమరయ్య వర్గాల సుధాకర్ , శ్యాంసన్ వివో ఏలు యాకస్వామి, రాజయ్య లావణ్య సంతోష రాజేశ్వరి లతో పాటు మహిళా ఉద్యోగులు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు బొల్లెపాక రాజేష్‌కు దళిత రత్న అవార్డు



**హనుమకొండ బ్యూరో/ సెప్టెంబర్27 (జర్నలిస్ట్ వార్త)** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల%–%2025లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే దళితరత్న అవార్డును ఈసారి హనుమకొండ జిల్లా తాటికాయల గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక ఎడిటర్, తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లెపాక రాజేష్ అందుకున్నారు.హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ వర్కింగ్ చైర్మన్ ఇటుక రాజు మాదిగ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ విషయాన్ని ఇటుక రాజు మాదిగ స్వయంగా ప్రకటించారు.అవార్డు స్వీకరించిన అనంతరం బొల్లెపాక రాజేష్ మాట్లాడుతూ%–% "ఈ గౌరవం వ్యక్తిగతంగా నాకు మాత్రమే కాకుండా జర్నలిజం రంగంలో కష్టపడుతున్న ప్రతి దళిత పాత్రికేయుడికి లభించిన గుర్తింపు. అట్టడుగు వర్గాల గొంతుకగా నిలవడం మన బాధ్యత. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వం, న్యాయం కోసం కలం పాడుతుంది. పేదల సమస్యలు, అణగారిన వర్గాల కష్టాలు వెలుగులోకి తెచ్చేందుకు నా జర్నలిస్టు ప్రస్థానాన్ని పూర్తిగా అంకితం చేస్తాను" అని పేర్కొన్నారు.అవార్డుకు ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం, అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఎంహెచ్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మైస ఉపేందర్, మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుల నాగేందర్, మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వీరేందర్ మాదిగ, దళిత సంఘాల నాయకులు రమేష్, సుమన్, నిర్మల్, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

## తగ్గేదే లే.. మేమూ తెలుగింటి ఆడబిడ్డలమే

### బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న స్టేషన్ ఘనపూర్ విద్యుత్ ఉద్యోగినిలు



**స్టేషన్ ఘన్పూర్/ సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త) :** జనగాం జిల్లా పరిధిలోని విద్యుత్ శాఖ నిర్వహించిన తెలంగాణ బతుకమ్మ సంబరాల్లో స్టేషన్ ఘనపూర్ విద్యుత్ ఉద్యోగ సోదరీమణులు శనివారం కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. తెలంగాణ బతుకమ్మ పండు గను భాద్రాపదమాసం అమావాస్య నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకొనే ఈ పండుగలో పూలనే దేవుళ్ళుగాకొలిచి తెలంగాణ సౌంస్కృతి,సాంప్రదాయా లకు ప్రతీకగా తెలంగాణ ఆడబిడ్డలు మొదటిరోజు ఎంగిలిపూలతో మొదలుబెట్టి తొమ్మిదవరోజు సద్దుల బతుకమ్మతో ముగిస్తారు. ఈ ఏడు పండుగలో మేము సైతం తెలంగాణ ఆడబిడ్డలమే అని గుర్తుచేస్తూ తెలంగాణ రాష్ట్ర ఎన్పిడిసిఎల్ పరిధిలోని జనగాం జిల్లా వ్యాప్తంగా ఎస్ఈ తంగెళ్ళపల్లి వేణుమాధవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న స్టేషన్ ఘనపూర్ విద్యు త్ ఉద్యోగ సోదరీమణులు తెలంగాణ సాంస్కృతికి అద్దంపట్టేటట్లు కనీ,వినీ ఎరుగని రీతిలో డిఈ ఆపరే షన్ ఘనపూర్ ఎలిశెట్టి రాంబాబు పర్యవేక్షణలో ఏఈ టెక్నికల్ ఎం శ్వేత ఆధ్వర్యం లో రోజంతా కష్టపడి ప్రకృతిప్రసాది . త తీరొక్కపూలతో చక్కగా బతుకమ్మను అలంకరించి జిల్లాలోనే తమ డివిజన్ బతుకమ్మను ఆకర్షణగా నిలిచేలా అలంకరించారు . ఈసందర్భంగా ఘనపూర్ డిఈ మాట్లాడుతూ ఎల్లప్పుడూ విధినిర్వ హణలో విరామంలేకుండా కష్టపడే ఉద్యోగులకు బతు కమ్మ పండుగ కారణంగా కాస్త విడిది ఇచ్చి అహ్లాధకర వాతావరణంలో తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయా లకు అనువుగా,కుటుంబ సమేతంగా వారిసంతోషం కోసం,ఈకార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించామ ని, డివిజన్ లోని ప్రతీ ఒక్కరూ రోజంతా కష్టపడి అబ్బురుపరిచే విధంగా బతుకమ్మను ఏర్పాటు చేసి ఆకర్షణగా నిలిపినందుకు సంతోషం కలిగించిందని ఈ బృహోత్తర కార్యక్రమంలో సేవలు అందించిన ప్రతీ ఉద్యోగులకు, గుత్తేదార్లకు, కాంట్రాక్ట్ కార్మికులకు ప్రత్యే కంగా అభినందించారు. ఈకార్యక్రమంలో ఘనపూర్ డివిజన్ నుండి ఏడిఈ పి రణధీర్ రెడ్డి, శ్రీనివాస్, ఏఈ లు కే విశ్వసాహితీ, పి శంకర్, జి.లక్ష్మి, నారాయణ, శివకుమార్,రణధీర్, సత్తయ్య, రాకేష్, సబ్ ఇంజనీర్ సాధన, మన్విత, హరిత ఉద్యోగ సంఘ నాయకులు నీలం ఐలేష్, ఒడ్డేపల్లి యాదగిరి, అల్వాల మహేందర్ రెడ్డి, బోసాని రాజ్ కుమార్, శ్రీదర్, అల్లావుల రాము, లక్ష్మి, అర్చన, దేవిక, సరిత, రమ్య,అమరేందర్, శ్రీధర్,రామకృష్ణ, అన్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.




## బిసి రిజర్వేషన్లపై జివో హైకోర్టులో విచారణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (జర్నలిస్ట్ వార్త) :** బీసీ రిజర్వేషన్ జీవో పై దాఖలైన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు శనివారం విచారణ జరిగింది. పిటిషనర్ తరపున న్యాయవాది మయూర్ రెడ్డి వాదనలు వినిపించారు . అయితే, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరుపున వర్చువల్‌గా అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సెక్షన్ 286 కింద 50శాతం మించరాదని పిటిషనర్స్ వాదించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు కూడా ఉన్నాయని

న్యాయవాది మయూర్ రెడ్డి గుర్తుచేశారు. కాగా, అసెంబ్లీలో బీసీ బిల్ కోసం తీర్మానం చేశామని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. గవర్నర్ దగ్గర బిల్ పెండింగ్‌లో ఉందని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ తీర్మానం ఫైనల్ చేసిందని.. అసెంబ్లీకి ఆ అధికారం ఉందని ఏజీ ఉద్ఘాటించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరపాలని ప్రభుత్వం చూస్తుందని తెలిపారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి అవసరం లేదని ఏజీ స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఏజీకి 15 నిమిషాలు సమయం ఇచ్చింది హైకోర్టు. ప్రభుత్వం నిర్ణయం చెప్పాలని ఆదేశించింది. అక్టోబర్ 8వ తేదీ వరకు ఎన్నికలు నోటిఫికేషన్ ఇచ్చిన మెరిట్ ప్రకారం కేసు విచారిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది.

# ది ప్యారడైజ్ మూవీలో మోహన్‌బాబు

కథానాయకుడు నాని - దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మరోసారి ది ప్యారడైజ్ మూవీలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. 'ది ప్యారడైజ్' అంటూ విభిన్న కథతో రానున్నారు. ఈ సినిమాలో అగ్ర నటుడు మోహన్ బాబు ఉన్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన లుక్‌ను రిలీజ్ చేశారు. ఇందులో మోహన్‌బాబు 'శికంజ మాలిక్'గా కనిపించనున్నట్లు తెలుపుతూ పోస్టర్ విడుదల చేశారు. షర్ట్ లేకుండా గన్, కత్తి పట్టుకుని సిగార్ కాలుస్తూ రగ్గడ్ లుక్‌లో మోహన్‌బాబు కనిపిస్తున్నారు. ఆయన పవర్‌ఫుల్ విలన్‌గా నటిస్తున్నట్లు- చిత్రబృందం తెలిపింది. ఇక ఇందులో నాని కూడా ఇప్పటివరకూ చూడని డిఫరెంట్ లుక్‌లో కనిపించనున్న విషయం తెలిసిందే. నాని 'జడల్' పాత్రలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 26న ఈ సినిమా ప్రేక్షకులను పలకరించనుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీతోపాటు-... మొత్తం 8 భాషల్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. తిరుగుబాటు-, నాయకత్వంతో పాటు- తల్లీకొడుకుల అనుబంధం కథకు కీలకంగా నిలవనున్నట్లు- ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతుంది.







# గాడ్ ఆఫ్ ఫియర్... దేవర-2 పై అధికారిక ప్రకటన

యంగ్ -టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన చిత్రం దేవర. గతేడాది సెప్టెంబర్ 27న రిలీజ్ అయిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి కొరటాలకు సూపర్ కంబ్యాక్ సినిమాగా నిలిచింది. అలాగే బాలీవుడ్ హాట్ బ్యూటీ- జాన్వీ కపూర్ కు టాలివుడ్ లో తొలి సినిమాతోన బ్లాక్ బస్టర్ ను తన ఖాతలో వేసుకుంది. రాజమౌళి సెంటిమెంట్ ను సైతం బ్రేక్ చేసిన హీరోగా ఎన్టీఆర్ సెన్సేషన్ చేసారు. కాగా ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందని గతంలోనే ప్రకటించారు. అయితే ఎన్టీఆర్ లైనప్ ను పరిశీలిస్తే దేవర 2 ఉండదనే చర్చ నడించింది. కానీ ఎట్టి పరిస్థితుల్లో దేవర 2 ఉంటుందని ప్రకటించడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అయ్యారు. ఇదిలా ఉండగా నేడు ఈ సినిమా రిలిజ్ అయి సంవత్సరం అయిన సందర్భంగా దేవర 2 గురించి కీలక ప్రకటన చేసారు మేకర్స్. ఈ సారి గాడ్ ఆఫ్ ఫియర్ రాబోతున్నాడు దేవర 2 కు రెడీ అవండి అని అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఈ ప్రకటనతో నందమూరి ఫ్యాన్స్ జోష్ రెట్టింపయింది. ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత జైలర్ డైరెక్టర్ నెల్సన్ తో సినిమా చేయాల్సి ఉంది. అలాగే త్రివిక్రమ్ తో కూడా సినిమా చేయబోతున్నాడు. మరి ఈ గ్యాప్ లో దేవర 2 ను ఎన్టీఆర్ ఎప్పుడు స్టార్ట్ చేస్తాడో చూడాలి. మరోవైపు దర్శకుడు కొరటాల దేవర 2 స్క్రిప్ట్ వర్క్ ను ఫినిష్ చేసే పనిలో ఉన్నాడు.



# ఈ అవకాశం కలలో కూడా ఊహించలేదు

## కాంతారా చాప్టర్-1 నటి రుక్మిణీ వసంత్

'కాంతార చాప్టర్ 1'లో నటించే అవకాశం వస్తుందని నేను కలలో కూడా ఊహించలేదని నటి రుక్మిణీ వసంత్ అన్నారు. 'కాంతార చాప్టర్ 1'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటి రుక్మిణి వసంత్. రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం అక్టోబర్ 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. నేను నటించిన 'సప్తసాగరాలు దాటి', 'ఏస్' చిత్రాలను రిషబ్ శెట్టి చూశారు. వాటి ప్రీమియర్స్‌కు వచ్చి నా నటనను మెచ్చుకున్నారు. ఇదంతా ఆయన నా ప్రీమియర్స్ చూసి ఇందులో ఛాన్స్ ఇచ్చారని నేను భావిస్తున్నా. కాంతార టీ-మ్ నాకు ఫోన్ చేసి ఇందులో భాగం అవుతారా అని అడిగినప్పుడు నా ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను. ఈ సినిమా 4,5 శతాబ్దాల మధ్య జరిగే కథ. అప్పటి పరిస్థితులకు తగినట్లు- వాటిని అర్థం చేసుకుంటూ నటించాలి. అలాగే దీనికోసం గుర్రపు స్వారీ, కత్తి యుద్ధంలలో శిక్షణ పొందడం ఎంతో సరదాగా అనిపించింది. కొన్ని యాక్షన్ సన్నివేశాలు చేశానని రుక్మిణి తెలిపారు. కొన్ని సందర్భాల్లో రిషబ్ శెట్టిని చూసి ఆశ్చర్యపోయినట్లు- తెలిపారు. నటు-డిగా, దర్శకుడిగా ఆయన ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలిస్తారని ప్రశంసలు కురిపించారు. ఇక తాను ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కాంబోలో రానున్న సినిమా, యశ్ టాక్సిక్ గురించి ఇప్పుడే ఏం చెప్పలేనని అన్నారు. తాను కెరీర్‌లో ఏ ఆఫర్‌నూ వదులుకోలేనని చెప్పారు.

# శరవేగంగా లెనిన్ చిత్రీకరణ

## శ్రీలీల ప్లేస్‌లో భాగ్యశ్రీ బోర్సే

అఖిల్ అక్కినేని హీరోగా వస్తున్న చిత్రం లెనిన్. వినరో భాగ్యం విష్ణు కదా ఫేమ్ మురలీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టంల్గ÷న్మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ నిర్మిస్తున్నారు. ఆ మధ్య రిలీజ్ లెనిన్ గ్లిమ్స్ సినిమాపై ఆడియెన్స్ లో క్యూరియాసిటిని పెంచింది. అలాగే ఈ సినిమాలో హీరోయిన్ గా మొదట శ్రీలీలను తీసుకున్నారు మేకర్స్. కొంత పోర్షన్ షూటింగ్ కూడా చేసారు. కానీ బాలీవుడ్ సినిమా కోసం లెనిన్ కు డేట్స్ ఇవ్వడంలో డిలే చేస్తుండడంతో ఆమెను ఈ సినిమా నుండి తప్పించి ఆ పోర్షన్ ను రీ షూట్ చేసారు మేకర్స్. శ్రీలీలతో కేవలం ఎనిమిది రోజుల షూట్ మాత్రమే చేసారు. ఆమె ప్లేస్ లో భాగ్యశ్రీ బోర్స్ ని అఖిల్ సరసన హీరోయిన్ గా తీసుకున్నారు. భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ యాక్షన్ డ్రామా ఇప్పటికే 80శాతం షూటింగ్ పూర్తయింది, చివరి షెడ్యూల్ ఈ నెలలో ప్రారంభమవుతుంది. -క్లైమాక్స్ సన్నివేశాలతో పాటు- ప్యాచ్ వర్క్ ను అక్టోబర్ నాటికి ఫినిష్ చేసేలా షెడ్యూల్ ప్లాన్ చేసారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఏడాది రిలీజ్ చేయాలని భావిస్తున్నారు. వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ ఏడాది నవంబరు 17న లెనిన్ ను రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నట్టు- తెలుస్తోంది. అందుకు అనుగుణంగానే షూటింగ్ ను జెట్ స్పీడ్ లో చేస్తున్నారు మేకర్స్. ఈ సినిమాతో ఎలాగైనా హిట్ కొట్టాలని అఖిల్ పట్టుదలగా ఉన్నాడు.


------



# ట్రిపుల్ ఎక్స్..సీక్వెల్‌లో దీపికా పడుకొణె

తుపాకులు.. అమ్మాయిలు.. రెండూ ఒకటే. ధైర్యంగా ప్రపంచాన్ని ఎదుర్కొంటాయి అంటూ 'ట్రిపుల్ ఎక్స్: రిటర్న్ ఆఫ్ జాండర్ కేజ్' అనే తన తొలి హాలీవుడ్ సినిమాతో అదరగొట్టింది బాలీవుడ్ తార దీపికా పదుకొణె. డీజే కరుసో తెరకెక్కించారు. ఈ స్పై యాక్షన్ చిత్రంలో విన్ డీసెల్, నినా డోబ్రేవ్, రూబీ రోజ్

తదితరులు కీలక పాత్రలు పోషించారు. 2017లో విడుదలై భారీ వసూళ్లతో రికార్డు సృష్టించిన ఈ సినిమాకు ఇప్పుడు సీక్వెల్ రాబోతున్నట్లు- తెలుస్తోంది. ఇందులో కూడా దీపికా పదుకొణె భాగం కానున్నట్లు- సమాచారం. ఈ కొనసాగింపు సినిమా చిత్రీకరణను దీపిక కోరిక మేరకు ముంబయిలో ప్రారంభించాలని సన్నాహాలు చేస్తుంది చిత్రబృందం. తన కుమార్తె కోసం ఆమె ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలో దీనికి సంబంధించిన వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నారని దీపిక సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి మరోసారి హాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్న ఆమె సందడి ఎలా ఉంటుందో చూడాలంటే కొన్ని రోజులు ఎదురుచూడాల్సిందే.



# 'కాంతార' వేడుకకు ఎన్టీఆర్.. హైదరాబాద్ లో గ్రాండ్ ఈవెంట్

పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో వస్తున్న 'కాంతార: ఏ లెజెండ్' చిత్రం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. కన్నడలో సంచలనం సృష్టించిన 'కాంతార'కు ప్రీక్వెల్ గా వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తెలుగు ప్రేక్షకులకు ఓ అదిరిపోయే అప్డేట్ ను చిత్రబృందం అందించింది. ఈ సినిమా తెలుగు ప్రీ రిలీజ్ వేడుకకు 'మ్యాన్ ఆఫ్ మాసెస్' జూనియర్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు అధికారికంగా ప్రకటించింది. హైదరాబాద్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ వేదికగా రేపు (ఆదివారం) సాయంత్రం 5 గంటలకు ఈ ఈవెంట్ ను గ్రాండ్‌గా నిర్వహించనున్నారు. ఇటీవలే రెబల్ స్టార్ ప్రభాస్ చేతుల మీదుగా ఈ సినిమా తెలుగు ట్రైలర్ విడుదల కాగా, ఇప్పుడు ప్రీ రిలీజ్ వేడుకకు ఎన్టీఆర్ వస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ ఈవెంట్ తో సినిమా ప్రచారం తెలుగు రాష్ట్రాల్లో మరో స్థాయికి చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

